

రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజురీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఐక్యత (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలో ఓ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని నియమించక విద్యార్థుల జీవితాలతో రేవంత్ సర్కార్ చెలగాటమాడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు లోకినిరమేష్, సునీల్, నవ్య పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం

● జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సబితకుమారి



వన్నారంలో అన్నప్రాసన నిర్వహిస్తున్న సబితకుమారి

మానకొండూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బాలింతలు, గర్భిణీలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సబితకుమారి సూచించారు. మండలంలోని వన్నారం గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సభలో ఆమె మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షత చూపరాదని, లింగ నిర్ధారణ పరీక్షల కోసం ఒత్తిడి చేస్తే 1098 హైల్ప్‌లైన్‌కు కాల్ చేయాలన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని లేకుంటే చట్టం తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని అన్నారు. వరకట్న నిషేధ, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. ఉమెన్ హెల్ప్‌లైన్, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, వృద్ధుల హెల్ప్‌లైన్ 14567, సైబర్‌క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబరు 1930 సేవలను వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అందుతున్నాయన్నారు. బాలికలు, మహిళలు ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీల్లో అందించే సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. మహిళలు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఇన్‌చార్జి సీడీపీవో శ్రీలత, ఎంపిడివో వరలక్ష్మీ, ఎంఈవో మధుసుధనాచారి, కిశోర బాలికలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్స్‌పై కొరడా

"బిడ్డ పెళ్లి కోసం.. కొడుకు చదువుకోసం పైసా పైసా పోగుచేసి తెలిసిన సంస్థ అని చిట్ వేస్తే చిట్ గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకపోవడం.. రేపు, మాపు అంటూ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ కొన్ని చిట్‌ఫండ్ సంస్థలు జనాలను మోసం చేస్తున్నాయి. మా సంస్థలో డిపాజిట్ చేస్తే వడ్డీ చెల్లిస్తామంటూ నమ్మించడంతో కొందరు రిటైర్డు ఉద్యోగులు , చిరు వ్యాపారులు చిట్టి డబ్బులతో పాటు తమ వద్ద దాచుకున్న డబ్బును కూడా డిపాజిట్ చేసి కాళ్లరిగేలా తిరుగుతున్నా చెల్లింపులు చేయడం లేదు. బాధితులు వందల సంఖ్యలో పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతిని ఆశ్రయించడంతో మోసాలకు పాల్పడిన నిర్వాహకులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు."



- బాధితులకు అండగా ఆస్తుల అటాచ్‌మెంట్ 'అస్త్రం'
- మరో 3 చిట్‌ఫండ్స్‌పై చర్యలు?
- మోసాలపై 50 కేసులు, 16 మంది అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క.. అన్నట్లుగా సభ్యులను మోసగించిన చిట్‌ఫండ్ సంస్థల నిర్వాహకులపై కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి కఠిన చర్యలకు ఉపక్రమించారు. కరీంనగర్‌లోని కొన్ని చిట్‌ఫండ్స్ నిర్వాహకులు సభ్యుల వద్ద చిట్ వేయించి ఆ డబ్బులను డిపాజిట్ల రూపంలో సేకరించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ బాధితులను మోసం చేసినట్లుగా గుర్తించిన పోలీస్ కమిషనర్ కేసులు, అరెస్టులతో సరిపెట్టకుండా సీఐడీ ద్వారా ఆ సంస్థల ఆస్తులను అటాచ్‌మెంట్ చేయిస్తున్నారు. మరో 3 చిట్‌ఫండ్స్‌పై కూడా ఆస్తుల అటాచ్‌మెంట్ అస్త్రం ప్రయోగించనున్నట్లు తెలుస్తోంది. చిట్‌ఫండ్స్ నిర్వాహకులతో పాటు జిల్లా వ్యాప్తంగా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరులు ప్రైవేట్‌గా నిర్వహిస్తున్న జీరో చిట్‌లపై కూడా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. నిఘా పోలీసులు సమాచారం సేకరించగా త్వరలో వీరిపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

● కేసులు నమోదు

చిట్ గడువు ముగిసిన తర్వాత డబ్బులు చెల్లించాల్సిన సంస్థలు చిట్ డబ్బులతో రియల్ వెంచర్లు వేసి ఓపెన్‌ప్లాట్‌లను రెట్టింపు ధరతో అంటగడుతున్నారు. ఎంతో కొంత చేతికి వస్తుందనే ఆశతో బాధితులు కూడా ఏమీ చేయలేక పోతున్నారు. గడిచిన ఏడాది కాలంలో చిట్‌ఫండ్స్ నిర్వాహకులు సభ్యులకు డబ్బులు చెల్లించకుండా మోసాలకు పాల్పడిన ఘటనలపై 50 కేసులు నమోదు కాగా, 16 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇందులో చిట్‌ఫండ్స్ చైర్మన్, డైరెక్టర్లు 9 మందిని అరెస్టు చేయటం గమనార్హం. చిట్‌ఫండ్స్ మోసాలు అధికమవటం, చిట్ సభ్యుల సమస్యలు పరిష్కరించాల్సిన చిట్ రిజిస్ట్రార్ శాఖ అధికారులు చేతులెత్తేయటంతో బాధితులు వందల సంఖ్యలో పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతిని ఆశ్రయించారు. పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేయటంతో చాలా చిట్‌ఫండ్స్ నిర్వాహకులు దారికి వచ్చి బాధితులతో రాజీ కుదుర్చుకుని వాయిదా పద్ధతిలో చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం.

● చిట్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతిమయం

చిట్‌ఫండ్స్, ఫైనాన్స్ సంస్థల లావాదేవీలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి ప్రభుత్వానికి పన్ను వసూలు చేయటంతో పాటు చిట్ సభ్యులను మోసం చేయకుండా చూడాల్సిన చిట్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. చిట్ డబ్బులు చెల్లించడం లేదని సభ్యులైన బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగడం లేదని బాధితులు వాపోతున్నారు. జీరో చిట్స్ నిర్వహించకుండా చూడాల్సిన చిట్ రిజిస్ట్రార్ అధికారులు ఆయా చిట్‌ఫండ్స్‌లలో తనిఖీలు చేయకుండా సభ్యులదే తప్పు అనే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చిట్‌ఫండ్స్‌లో ఒక చిట్ నిర్వహణకు చిట్ మొత్తం డబ్బులు చిట్ రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. చిట్ పూర్తి అయినప్పటికీ ఎవరైనా సభ్యులకు చిట్ డబ్బులు చెల్లించని సందర్భంలో నిబంధనల ప్రకారం చిట్‌ఫండ్స్‌కు చెందిన డిపాజిట్ డబ్బుల నుంచి ఆ సభ్యుడికి డబ్బులు చెల్లించే అధికారం చిట్ రిజిస్ట్రార్ అధికారులకు ఉంటుంది. చిట్‌ఫండ్స్ నిర్వాహకులతో ములాఖత్ అయిన చిట్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు చిట్ డబ్బులు సభ్యులందరికీ చెల్లించారా? లేదా? అనేది సరిచూసుకోకుండా ఆ సంస్థల డిపాజిట్‌లను రిలీజ్ చేస్తున్నారు. గతంలో ఒక చిట్‌ఫండ్స్‌లో సభ్యులకు డబ్బులు చెల్లించకుండానే ఆ సంస్థకు చెందిన డిపాజి ట్‌ను రిలీజ్ చేయగా ఒక అధికారి సస్పెన్షన్‌కు గురయ్యాడు.

చెత్తను, వ్యర్థాలను వేరు చేయాలి

- రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ విధానాన్ని కొనసాగించాలి
- మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ విధానంలో చెత్తను, వ్యర్థాలను వేరు చేయాలని, పారిశుధ్య నిర్వహణ పనులు నిరంతరం కొనసాగించాలని మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పేయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక హౌజింగ్ బోర్డుకాలనీలోని నగర పాలక సంస్థ రీసోర్సు పార్కును సానిటేషన్ అధికారులు, ఐటీసీ ప్రతినిధు లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. రీసోర్సు పార్కులో సాలిడ్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఆర్‌ఆర్ షెడ్డును, వర్మీకంపోస్టు పిట్స్‌ను పరిశీలించారు. గతంలో చేపట్టిన చెత్త రీసైక్లింగ్ ప్రక్రియ సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాలిడ్, ప్లాస్టిక్ వేస్టు మేనేజ్‌మెంట్ ప్రక్రియను పాటించాలని, రీసైక్లింగ్ కోసం వాడుకలోకి తేవాలని ఐటీసీ సంస్థ సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు బొమ్మకల్ విలీన గ్రామంలో పర్యటించారు. రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ పద్ధతిలో చెత్తను, వ్యర్థాలను వేరు చేయాలని సూచించారు. నగరవ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగేలా పారిశుధ్య అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నారు. రీసోర్సు పార్కు సెంటర్‌లోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను వినియోగంలోకి తేవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న వర్మీకంపోస్టు పిట్స్‌కు అదనంగా మరో మూడు కంపోస్టు పిట్స్ కట్టించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ట్రిబుల్ ఆర్ సెంట ర్‌కు ప్రతి రోజు స్వచ్ఛ ఆటోలను తరలించి వ్యర్థాలను వేరు చేసే ప్రక్రియను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ స్వామి, ఏఈ సతీష్, ఐటీసీ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.



రీసోర్స్ పార్కులో అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



స్వదేశీ మేళాలో మాట్లాడుతున్న బెల్లంమాధవి

భగత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని మహిళా సాధికారత, వ్యాపార వ్యవస్థాపక కమిటీ చైర్మన్ బెల్లం మాధవి అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలో 'మహిళా ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి' అనే అంశంపై మహిళలకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మూల స్తంభాలంటివారన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, గృహిణిగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే వ్యాపారాలు, వృత్తులు, ఉద్యోగాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. స్వదేశీ జాగరన్ మంచ్ తెలంగాణ ప్రాంత మహిళా ప్రాంత మహిళా ప్రముఖ్ డాక్టర్ కళ్లెం స్వప్న మాట్లాడుతూ భారత దేశ సంస్కృతికి అహల్యాబాయి విశేషకృషి చేశారన్నారు. ధానధర్మాలకు మారుపేరుగా నిలిచి మహ్మదీ యులదాడుల్లో శిథిలమైన అనేక దేవాలయాలను పునర్నిర్మాంచార న్నారు. ఈ కార్యక్రమంలో సామ ఎల్లారెడ్డి, బల్లం స్వప్న, బూర్ల విజయలక్ష్మీ, కామారపు మంజుల, కళ్లెం కవిత, పాక సంధ్యారేఖా, రమ, స్వరూపారాణి, కాచం దీప్తి, కరీంనగర్ డెయిరీ చైర్మన్, స్వదేశీ మేళా కన్వీనర్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● సరస్వతి శిశు మందిర్ విద్యార్థుల ప్రదర్శనను తిలకించిన కలెక్టర్

నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలో శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు ప్రదర్శించిన సాహిత్య ప్రదర్శనశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. సాహిత్యంలోని పలు పుస్తకాలు అద్భుతంగా ఉన్నాయని వాటిని చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బల్మూరి కరుణాకర్‌రావు, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్‌చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, ముక్క హరీష్‌బాబు, దుర్శేట్టి నిరంజనాచారి, పాల్గొన్నారు.



నకిలీ ధ్రువపత్రాలతో భూ విక్రయం
• 13 మందిపై కేసు నమోదు
• నలుగురు నిందితుల అరెస్టు
6

కూలీలకు వరం జన్‌మన్ నరేగా
• అరచేతిలో ఈజీఎస్ సమాచారం
• అందుబాటులోకి కొత్త యాప్
• పారదర్శకత, నిధుల దుర్వినియోగానికి చెక్
6

బీఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలి
7

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● పోస్టల్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



హుజూరాబాద్ తపాలా కార్యాలయం ఎదుట . ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నూతన సంస్కరణల వల్ల తపాలా వ్యవస్థ నిర్వీర్యమవుతోందని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యు మహేందర్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ తపాలా కార్యాలయం ఎదుట పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ల ద్వారా పోస్ట్ మెన్ స్టాఫ్ తగ్గిపోతుందన్నారు. మెకనైజ్డ్ డెలివరీ సిస్టమ్ ద్వారా పోస్టల్ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. తపాలాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలన్నారు. తపాలా ఉద్యోగులకు నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకొని వేతనాలు పెంచాలన్నారు. గ్రామీణ డాక్ సేవకులను తీసుకొని సివిల్ సర్వెంట్ హోదా కల్పించడంతో పాటు, పెన్షన్, మెడికల్, బెనిఫిట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రజినీకాంత్, తిరుపతినాయక్, అనిల్, రాజమౌళి, ప్రవీణ్, చంద్రమోహన్, వేణు, సందీప్, శ్రీనివాస్, సమ్మరాజు, తిరుమలేష్, హరీష్, అనిల్, స్వామి, అపూర్వ, శివాజీ, సాయి, సత్యం, రాము తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు శాస్త్రీయత లేదు

- కులాలవారీగా ముసాయిదాను బహిర్గతం చేయాలి
- బీసీలను తగ్గించి అవమానపరిచారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిటీ, బీసీ కమిషన్ లేకుండా ప్లానింగ్ కమిటీ ద్వారా చేపట్టిన కులగణన సర్వేకు శాస్త్రీయత లేదు, ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే బీహార్ ప్రభుత్వం జీఏడీతో చేపట్టిన కులగణన అశాస్త్రీయమంటూ అక్కడి కోర్టు కొట్టేసినట్లు కులగణను కొట్టి వేస్తుందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. శుక్ర వారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. బీసీ కులగణన రీసర్వే చేపట్టాలన్నారు. ఇంటింటికి వెళ్లి కులాల వారీగా సమాచారం సేకరించి, ముసాయిదాను గ్రామసభల్లో పెట్టి ఆమోదించిన తర్వాత మంత్రివర్గం ఆమోదించి పార్లమెంట్‌కు పంపించి జనాభా దామాషా ప్రకారంగా బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు వర్తింపజేయాలన్నారు. ఎన్నికలకు ముందు కామా రెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ కులగణన 2011 జనాభా ప్రకారంగా ఇంట్లో కూర్చొని అశాస్త్రీయంగా చేసి తెలంగాణ రాష్ట్ర జనాభాతో పాటు బీసీ జనాభాను తగ్గించి 75 ఏళ్లుగా కాంగ్రెస్ చేసిన మోసాన్ని మరోసారి చేసిందని విమర్శించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎవరో ఒకరు, ఎప్పుడో ఒక సారి బీసీ నాయకుడు సీఎం అయ్యాడు కానీ తెలుగు రాష్ట్రాలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, తెలంగాణలో కానీ ఒక్కరు కూడా బీసీ కాలేదని ఇది బీసీలకు జరిగిన అన్యాయానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆనాటి సీఎం కేసీఆర్ రాజ్యాధికారం బీసీలకు అందించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రిగా తాను కొనసాగుతుండగా వకుళాభరణం కృష్ణమోహన్ చైర్మన్‌గా 2021 నవంబర్ 16న బీసీ కమిషన్ వేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి కులగణన చేపట్టిన తర్వాత మంత్రివర్గంలో ఆమోదించి దాని ప్రకారంగా ఫలాలు అందిస్తామని కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని అన్నారు. జనవరి 29, 2024లో బీసీ కమిషన్ చైర్మన్ కమిషన్ నివేదికను ప్రస్తుత ప్రభుత్వానికి సమర్పించగా, కమిషన్ నివేదికను మంత్రివర్గం ఆమోదం తెలిపి అసెంబ్లీ ఏర్పాటు చేసి చట్టం చేస్తామని ప్రకటించిందని అన్నారు. బీహార్, కర్ణాటక ప్రభుత్వాలు శాస్త్రీయంగా కులగణన చేయకపోవడంతో కోర్టు కొట్టేసిందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్‌గా నిరంజన్‌ను నియమించిన ప్రభుత్వం ఆ తర్వాత ఆ జీవో 26ను బొందపెట్టారన్నారు. ప్లానింగ్ కమిషన్ నుంచి జీవో నెంబర్ 18 తీసుకువచ్చి కులగణన చేపట్టినట్లు తెలిపారు. సందీప్‌కుమార్ సుల్తానియా, ఉత్తమ్ కుమార్‌రెడ్డి కులగణను మమ అనిపిం చారని విమర్శించారు. కేంద్ర ప్రకటిం చిన 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం 13.8శాతం జనాభా పెరుగుతుందని ఏ లెక్క చూసినా 4 కోట్ల 25 లక్షల జనా భా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభు త్వం 3.54 కోట్ల జనాభా ఉందని, మరో 16 లక్షల మంది సర్వేలో పాల్గొనలేదని, మొత్తం 3.70 కోట్ల జనాభాగా చెబుతున్నారని, రాష్ట్ర జనాభాను తక్కువగా చూపించ డానికి కారణం బీసీ జనాభా పెరుగలేదని చూపించడానికోసమేనని విమ ర్శించారు. బీసీలకు 46శాతం వాటా అని చెప్పి అన్యాయం చేయడం కాదు.. అవమానం చేశారని గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముసాయిదాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, అన్యాయం చేస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్య క్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య


భారతపు జల(ఫైల్)

జగిత్యాలరూరల్,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు జల(43) అనేవివాహిత అప్పుల బాధతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపినవివరాల ప్రకారం.. భారతపు జల-శ్రీనివాస్ భార్యభర్తలు కొన్నిరోజులుగా అప్పులబాధతో మన స్తాపం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గతనెల28వతేదీన జగిత్యాలరూరల్ మండలంలోని బాలపల్లి శివారులో గల తమ వ్యవసాయ పొలం వద్ద భార్యభర్తలు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మృతురాలు జల కుమారుడు ఇద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందినతండ్రి శ్రీనివాస్ పరిస్థితి మెరుగుపడగా ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. తల్లి జల పరిస్థితి విషమించడంతో కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితివిషమించి శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు..
చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కడెం తిరుమలేష్ (37) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడెం తిరుమలేష్ ఈనెల 11న తన పనిలో భాగంగా తన స్వగ్రామం తిమ్మాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డుపై కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఇబ్రహీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వరపేట గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరద కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు శుక్రవారం గుర్తించారు. వరద కాలువకు అనుకోని ఉన్న పంపుహౌజ్ ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతదేహం ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. వ్యక్తి ఒంటిపై లేత వంకాయ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. మృతదేహాన్ని గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న..
కాపర్‌వైర్ దొంగల అరెస్ట్


పట్టుపడిన కాపర్ వైర్ దొంగలు

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వరుస కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కొన్నినెలలుగా రామగిరి, మంథని అంతర్గాం మండలాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఊరికి దూరంగాఉంటున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎంచుకొని అందులోని కాపర్‌వైర్‌ను చోరీ చేస్తున్నట్లు తెలిపారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన మోటం దేవేందర్, మోటం రాంబాబు, సజ్జశిరీష, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన ఇప్ప గంగాధర్, పరతం రాములును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 35 కిలోల కాపర్‌వైర్, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చంపుతానని బెదిరించిన
నలుగురిపై కేసు నమోదు

గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన ఎండీ మజీద్‌ను చంపుతామని బెదిరించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య శుక్రవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 12న మజీద్‌ను మండలంలోని చెందోళి గ్రామానికి చెందిన కటారి వంశీ, అశ్విన్ రావు, గుల్లకోట సత్యం, దావు తిరుపతి అనే నలుగురు వ్యక్తులు ఫోన్‌లో తిట్టారన్నారు. చిల్వాకోడూర్ ఎక్స్ రోడ్డు వద్దకు వచ్చి బాధితుడిని బూతులు తిడుతూ చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో
వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష


గొల్లపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆకుల తిరుపతి అనే వ్యక్తికి డ్రంకెన్ డ్రైవ్‌కేసులో వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులకు పట్టుబడగా జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కరుణాకర్ నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. గత సంవత్సరం డిసెంబరు 28న చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులో ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ తిరుపతి పట్టుబడ్డాడు. అతడికి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 550/120 ఎంఎల్ రీడింగ్ రావడంతో అతడిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు తిరుపతిని కోర్టులో హాజరు పరచగా ఈ మేరకు స్పెష్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

చెక్ పోస్టు తనిఖీ


చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలోభాగంగా కలెక్టర్ ఆదేశాలమేరకు కల్వచర్ల ప్రధాన రహదారి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్, ఎస్ఐ చంద్రకుమార్‌లు సంయుక్తంగా తనిఖీ చేపట్టారు. అనంతరం రికార్డులను తనిఖీ చేపట్టారు.

కూలీలకు వరం
జన్‌మన్ నరేగా

- అరచేతిలో ఈజీఎస్ సమాచారం
- అందుబాటులోకి కొత్త యాప్
- పారదర్శకత, నిధుల దుర్వినియోగానికి చెక్

చొప్పదండి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పారదర్శకతను పెంచేలా కేంద్ర ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉపాధిహామీ కూలీలకు అందుబాటులో ఉండేలా దీనిని రూపొందించారు. ఈ పథకంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తిగా పారదర్శకత ఉండేలా యాప్‌ను ఏర్పాటు చేశారు. జన్‌మన్ నరేగా పేరుతో వచ్చిన ఈ కొత్త యాప్ కూలీలకు సులభంగా సమాచారం అందేలా తీర్చిదిద్దారు. కూలీలు చేసిన పని, వేతనం వివరాలు, గ్రామాలలో ఉపాధి పనులు యాప్‌లో అందుబాటులోకి రాగా ఉపాధి కూలీలకు యాప్ వరంగా మారనుంది.

కూలీల వేతనాల దుర్వినియోగానికి చెక్

ఉపాధిహామీ కూలీలకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఏ ఖాతాలో కూలీ డబ్బులు జమ అవుతున్నాయో తెలియని పరిస్థితి. వేతనాలు రావడం లేదని కూలీలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఎంత పనిచేశారో తెలియదు. ఉపాధిహామీ సిబ్బంది రాసిందే పని, వచ్చిందే వేతనం అన్న చందంగా ఉండేది. ఎంత పనిచేశారో ఈ యాప్ ద్వారా కూలీలకు పూర్తిగా తెలుస్తుంది. తద్వారా తమకు ఎంత వేతనం వస్తుందో ముందే కూలీలకు తెలుస్తుంది.

సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా

సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లో జన్‌మన్ నరేగా అని టైపు చేయగానే యాప్ వివరాలు వస్తాయి. దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో ఆరు రకాల ఆప్షన్లు ఉంటాయి. మొదట ఆప్షన్‌ను నొక్కగానే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, పంచాయతీ, గ్రామం, ఫ్యామిలీ ఐడీ వివరాలను సెలక్ట్ చేసుకోవడంతో పూర్తి వివరాలు వస్తాయి. లేదా కూలీల ఉపాధిహామీ జాబ్‌కార్డు నెంబర్ నమోదు చేయగానే కూలీకి సంబంధించిన వివరాలను కనిపిస్తాయి.

జాబ్‌కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. అటెండెన్స్ ఆప్షన్‌ను ఎంచుకోవడంతో ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు, ఎన్ని రోజులు పనిదినాలు మిగిలి పోయాయనే వివరాలు కనిపిస్తాయి.

దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా చేయాల్సిన పని దినాలు కనిపి స్తాయి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరుమీద క్లిక్ చేయగానే ఎన్ని రోజులు, ఎక్కడ పనిచేశారు. కూలీ ఎంత, ఎప్పుడు వారి ఖాతాల్లో జమ చేశారు, ఏ బ్యాంకులో జమ చేశారనే వివరాలు కనిపిస్తాయి. ఉపాధిహామీ డబ్బులు జమకాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించి ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్(ఏబీపీఎస్) లింకు అయిందో లేదో వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ లింకు అయితే పచ్చరంగులో రైట్ గుర్తు ఉంటుంది, లింకు కాకుంటే ఎరుపు రంగులో తప్పు గుర్తు ఉంటుంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఇసుకను తరలిస్తున్న గన్నేరువరం మండలం చొక్కరావుపల్లె గ్రామానికిచెందిన కాంపల్లిరవిపై కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లుపేర్కొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్(52) అనే గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ శనివారం సాయంత్రం కల్లుతీయడానికి తాటి చెట్టు పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. గాయాలపాలైన శ్రీనివాస్ గౌడ్‌ను కరీంగనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6900 పలికింది. మార్కెట్ యార్డుకు 16మంది రైతులు 150క్వింటాళ్ల విడిపత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6900, కనిష్ఠ ధర రూ.5400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తాను నిర్జీవం..అవయవాలు సజీవం

- యువ రైతు బ్రెయిన్‌డెడ్
- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు


ముస్కు రాజేందర్‌రెడ్డి (ఫైల్)

ఎండపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి (35) అనేయువరైతు బ్రెయిన్‌డెడ్ కాగా కుటుంబసభ్యులు రైతు అవయవాలను దానంచేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గొడిశెలపేట గ్రామానికి చెందిన ముస్కు రాజేందర్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపేవాడు. ఈనెల 10వతేదీన తల తిరుగుతోందని స్పృహతప్పి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అతడికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని ఆపరేషన్ చేశారు. అనంతరం వైద్య పరీక్షలకు హైదరాబాద్‌కి పంపించగా అక్కడ పరిశీలించిన వైద్యులు అతడు బ్రెయిన్ డెడ్‌బ అయినట్టు నిర్ధారించారు. ఎనిమిది రోజులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తాను చనిపోయినా ఎనిమిది మంది ప్రాణాలు నిలిపాడు. యువరైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థుడు

ముత్తారం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో తాడిచర్ల బ్లాక్1,2 ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం వందలాదిలారీలలో ఇసుకను తరలిస్తుండడంతో దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నామని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కర్రె రాంచంద్రం అనే వ్యక్తి శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపాడు. రహదారిపై మంచం వేసుకొని పడుకొని ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా తాడిచర్ల బ్లాక్1,2 ఇసుకక్వారీ నుంచి వందలాది లారీలతో ఇసుకను తరలిస్తుండడంతో ఇండ్లలోకి దుమ్ముధూళి చేరుతోందన్నాడు. తాగే నీటిలో, తినే అన్నంలో దుమ్ము పడుతోందని, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. లారీలు రాకపోకలతో రహదారి పూర్తిగా దెబ్బతిని మట్టి రోడ్డును తలపిస్తుందని అన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక క్వారీలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాడు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని పక్కకు తప్పించారు.

నకిలీ ధ్రువపత్రాలతో భూ విక్రయం

- 13 మందిపై కేసు నమోదు
- నలుగురు నిందితుల అరెస్టు


నిందితులను కోర్టుకు తీసుకెళ్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇతరుల భూమికి నకిలీ ధ్రువీకరణపత్రాలు సృష్టించి, తప్పుడు హద్దులు చూపుతూ పలువురికి విక్రయించిన కేసులో ఎస్‌ఆర్‌ఎస్‌పీకి చెందిన ఇద్దరు అధికారులతోపాటు మరో 11 మందిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో కేసు నమోదైంది. ఈకేసులో నిందితులుగాఉన్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్‌కుచెందిన సర్వేనంబరు 954లో వావిలాలపల్లికి చెందిన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, ఆయన తల్లి సత్యవతి పేరిట 6 ఎకరాల 18 గుంటల భూమి ఉండగా ఇందులో నుంచి 34మందికి 4ఎకరాల వరకు ఇతరులకు విక్రయించాడు. మిగిలిన 2ఎకరాల 18 గుంటల భూమిలో ఎకరం 20గుంటల భూమిని మానేరు బైపాస్ రోడ్డు కోసం ప్రభుత్వం తీసుకుంది. ఇంకా దాదాపు 38గుంటల భూమిమిగిలి ఉంది. ఆయన అమెరికా వెళ్లారు. అదేసర్వే నంబరులో వెంకటేశ్వరరావు భూమిని ఆనుకుని పంతంగి రాంచందర్‌రావుకు 11గుంటల భూమి ఉంది. వెంకటేశ్వరరావు అమెరికాలో ఉంటున్నవిషయం తెలుసుకున్న బల్మూరి రమణారావు, దాసరి బుచ్చిరామిరెడ్డి, మహ్మద్ బషీర్ కలిసి ఒకముఠాగా ఏర్పడి వెంకటేశ్వరరావుకు చెందిన 38గుంటల భూమిని కాజేయాలని పథకం రచించారు. ఈ మేరకు పంతంగి రాంచందర్‌రావు భూమిని అధిక ధరకు కొనుగోలు చేస్తామని ఆశచూపి, 2014లో 41 గుంటల భూమిని 10మంది పేరిట రాంచందర్‌రావుతో తప్పుడు రిజిస్ట్రేన్ చేయించుకున్నారు. వెంకటేశ్వరరావు 2022లో తనభూమిపై ఈసీ కోసం దరఖాస్తు చేయగా 10 మంది పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ తప్పుడు రిజిస్ట్రేషన్ కోసం ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి నో ఆబ్జెక్షన్(ఎన్‌ఓసీ) సర్టిఫికెట్ ఇవ్వడంలో ఇద్దరు అధికారులు సహకరించారు. దీనిపై బాధితుడైన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేయగా తప్పుడు పత్రాలతో 10 మంది పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు వెల్లడైంది. ఈ నేరానికి పాల్పడిన రంగారెడ్డి జిల్లా కీసరకు చెందిన పంతంగి రాంచందర్‌రావు(83), కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్(54), కట్టరాంపూర్‌కుచెందిన బొల్లవేణి శంకర్ (64), జ్యోతినగర్‌కుచెందిన బల్మూరి విజయ్‌కుమార్(46), గణేష్‌నగర్‌కుచెందిన దేశవాణి శంకర్ (71), జగిత్యాలజిల్లా ఎండపల్లికి చెందిన మంతెన నర్సయ్య(54), కరీంనగర్ రాఘవేంద్రనగర్‌కు చెందిన నందికొండ మురళీధర్‌రెడ్డి(64), తిరుమలనగర్‌కు చెందిన దాసరి శ్రీనివాసరెడ్డి(40), మొగ్దుంపూర్‌కు చెందిన బల్మూరి రమణారావు(50), గణేష్‌నగర్‌కు చెందిన దాసరిసంజీవరెడ్డి(38),దాసరి బుచ్చిరాంరెడ్డి (67)తోపాటు ఎస్‌ఆర్‌ఎస్‌పీకిచెందిన ఇద్దరు అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

నిందితుల్లో బల్మూరి రమణారావు, దాసరి సంజీవరెడ్డి, దాసరి బుచ్చిరాంరెడ్డి, మొహమ్మద్ బషీర్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని, ఎస్‌ఆర్‌ఎస్‌పీ అధికారులపై విచారణ కొనసాగుతోందని సీఐ వివరించారు.

పూరిగుడిసె దగ్ధం


దగ్ధమైన పూరిగుడిసె

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో నుంచి వ్యాపించిన మంటలు పూరిగుడిసెకు అంటుకోవ డంతో ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు గ్రామానికి చెందిన శాఖపురపు లక్ష్మి గృహానికి అంటుకొని ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఇంట్లో నగదు 50వేల రూపాయలతో పాటు, సామగ్రి కాలిబూడిద అయిందని బాధిత మహిళ లక్ష్మి తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన నష్టాన్ని అంచనావేసి పైఅధికారులకు నివేదించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామప్రజలు కోరారు.

దళితుడిపై దాడి హేయమైన చర్య


నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ వాహనం నడిపాడని తమిళనాడులో దళిత యువకుడిని అగ్రవర్ణాలవారు రెండు చేతులు నరికి వేయడం హేయమైన చర్య అని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ అన్నారు. దళితుడిపై దాడికి నిరసనగా జగిత్యాల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కొత్త చట్టాలు రూపొందించి దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. కేవం ఓట్ల కోసం, సీట్ల కోసం దళితులను వాడుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మద్దెల నారాయణ, తోట జగన్, సూరమల్ల సతీష్, రాజారత్నం, చంద్రయ్య, పుట్ట గంగాధర్, జక్కుల దేవయ్య, నర్ర రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- సిరిసిల్లలో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యవ్యస్థ కుంటుపడిపోయిందని ప్రభుత్వం వెంటనే మంత్రి నియమించడంతో పాటు పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించడంతోపాటు పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్టిఫికెట్స్ కోసం కళాశాల యాజమాన్యాలు డబ్బులు కడితేనే ఇస్తామని వేధింపులకు గురిచేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అప్పులు చేసి డబ్బులు ఇచ్చి సర్టిఫికెట్‌లను తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, కుమార్, అజయ్, నిఖిల్, సమీర్, సంజయ్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో లాభాలు

- కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్లో డిమాండ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గతంలో బంధువులేవరైనా ఇంటికివస్తే పెంచుకున్న కోళ్లను కోసి వండిపెట్టేవారు. కాలక్రమేనా నాటు కోళ్ల పెంపకం కనబడకుండా పోయింది. చాలామంది బ్రాయిలర్‌కోళ్లకు అలవాటు పడ్డారు. అయితే ఇటీవల బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతోందని పుకార్లు రావడంతో నాటుకోళ్లకు గిరాకీ పెరిగింది. ఒక నాటుకోడి గుడ్డును రూ.10 నుంచి 12వరకు విక్రయిస్తున్నాడు. హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన అల్లి సత్యరాజ్ అనేవ్యక్తి గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచేవాడు. లాభాలు తక్కువ వస్తున్నాయనే ఉద్దేశ్యంతో అదే షెడ్డులో నాటు కోళ్ల పెంపకం ప్రారంభించాడు. ఏడాది క్రితం వెయ్యి నాటు కోళ్లను తీసుకురాగా, లాభాలు వచ్చాయి. దీంతో మళ్లీ నాటు కోడి పిల్లలను తీసుకువచ్చి పెంచుతున్నాడు. ఈ కోళ్లకు ఆహారంగా దానతో పాటు పచ్చి కూరగాయలు అందిస్తున్నాడు. మార్కెట్‌లో కిలో నాటుకోడి రూ.400 పైన ఉన్నా ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. హుజూరాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్ మండలాల ప్రజలు వచ్చి నాటుకోళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఈకోళ్ల బాగోగులు చూసుకోవడం కోసం ఇద్దరు పనివారిని పెట్టుకున్నాడు. ఈపెంపకం గురించి తెలియడంతో ఇతర ప్రాంతాల నుంచి ఆసక్తిగల పౌల్ట్రీ రైతులు వచ్చి సత్యరాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.


కాట్రపల్లిలో నాటుకోళ్ల షెడ్

వెయ్యి నాటు కోళ్లు పెంచుతున్నా..
- అల్లి సత్యరాజ్, పౌల్ట్రీ రైతు, కాట్రపల్లి



నాటు కోళ్ల పెంపకంతో లాభాలు వస్తున్నాయి. గతంలో బ్రాయిలర్ కోళ్లను పెంచడంతో ఆర్థికంగా నష్టపోయాను. ప్రస్తుతం వెయ్యి నాటు కోళ్లను పెంచుతున్నాను. మరో 15రోజుల్లో ఇంకో వెయ్యి కోళ్లను పెంచేందుకు షెడ్లను ఏర్పాటు చేస్తున్నాను. నాటు కోడి గుడ్లు, మాంసానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో కోడి రూ.400లకు విక్రయిస్తుండగా, గుడ్డును రూ.10నుంచి 12కు విక్రయిస్తున్నాను.



సుల్తానాబాద్‌లోని పెరికెగిద్ద అంజన్న ఆలయం

అంజన్న భూములు పక్కదారి

- ఆలయ భూముల్లో మున్సిపాలిటీ పాగా
- గోశాల పేరిట మరి కొందరి ఆధీనం
- ధూపదీప నైవేద్యం స్కీంకు నోచుకోని అర్చకుడు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): అంజన్న ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవాదాయశాఖ అధికారుల ఉదాసీనత వల్ల ప్రభుత్వ పరమయ్యాయి. ఆలయానికి భూములు ఉండడంతో అర్చకుడికి ధూపదీప నైవేద్యం స్కీంకు నోచుకోవడం లేదు. దాతలపై ఆధారపడి అర్చకులు కాలం వెళ్లదీస్తున్నారు. మున్సిపాలిటీ కొన్ని ఎకరాలను అనధికారికంగా తమ ఆధీనంలోకి తీసుకొంది. అందులో మామిడి తోట పెట్టారు కానీ ఏనాడూ ఆదాయం సమకూరిందీ లేదు. పూత, కాత లేదంటూ వచ్చిన ఫల సాయం కూడా మున్సిపాలిటీ వారే పంచుకుంటున్నారు.

సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద ఆంజనేయ స్వామి ఆలయం గతంలో ప్రాచుర్యంలో ఉండేది. 1961లో అప్పటి పుర ప్రముఖులు ఆకుల మల్లయ్య, నారాయణ, సాదుల వెంకటనర్సయ్య తదితరులు సర్వే నంబరు 779లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొంత దాతల సహకారంతో ఆలయాన్ని పూర్తి చేశారు. ఆలయ పరిధిలో దాదాపు పది ఎకరాలకు పైగా భూములు ఉండేవి. భూముల సాగు ద్వారా ఆలయ నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఆలయం ఊరికి దూరంగా ఉండడం, ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురైంది. దీంతో క్రమంగా ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. భూములు పెద్ద ఎత్తున ఉండడంతో నాలుగు ఎకరాలలో స్మశాన వాటికను ఏర్పాటు చేశారు. దాన్ని సాకుగా తీసుకుని కొందరు భూములను తమ ఆధీనంలోకి తీసుకు న్నారనే ఆరోపణలున్నాయి. 2016లో అప్పటి ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టడంతో ఐదు ఎకరాల అంజన్న భూములను తీసుకున్నారు. ఇప్పటికి మున్సిపాలిటీ ఆధీనంలోనే భూములున్నాయి. ఈ విషయంలో దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయం ముందున్న రోడ్డు, ఐసీడీఎస్ ఆఫీసు పక్కన ఉన్న మంచినీటి బావి కూడా ఆలయ భూముల కిందకే వస్తుంది. ఇలా ఆలయ భూములు పక్కదారి పట్టాయి. ప్రభుత్వ పరంగా ధూప దీప నైవేద్యాల స్కీంలో అర్చకుడికి రావాల్సిన గౌరవ వేతనం రాకుండా ఆలయ భూములు అడ్డుపడుతున్నాయి. కొన్నేళ్లు ఆలయం నిరాదరణకు గురై ధూపదీప నైవేద్యాలకు కూడా నోచుకోలేదు. దివంగత మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో మళ్లీ భక్తుల రాకపోకలు కొనసాగుతున్నాయి. సంబంధిత దేవాదాయశాఖ అధికారులు జోక్యం చేసుకుని అంజన్న ఆలయ భూములు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలయ భూముల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని మామిడిచెట్లు

ఆలయ భూములు పరిరక్షించుకుంటాం

ఆలయ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి

అంజన్న ఆలయం పరిధిలో పది ఎకరాల వరకు ఉంది. అందులో కొన్ని ఎకరాలు స్మశాన వాటికకు తీసుకున్నారు. అలాగే మున్సిపాలిటీ అనధికారికంగా ఐదెకరాల వరకు తీసుకొంది. ఇటీవల గోశాల పేరిట మరికొంత భూమి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో ఆలయ భూములు లేకుండా పోయాయి. ఐసీడీఎస్ ఆఫీసు పరిధిలోని బావి వరకు, ఆలయం ముందు ఉన్న రోడ్డులో కూడా ఆలయ స్థలం పోయింది. ఆలయ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూస్తాం.

చర్యలు తీసుకుంటాం

సుజాత దేవాదాయ శాఖ అధికారిణి

సుల్తానాబాద్‌లోని అంజన్న ఆలయ భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. మామిడితోట పెంచుతున్న భూములు దేవాదాయ శాఖకు చెందినవే. అధికారికంగా తాము ఎవరికీ బదలాయించలేదు. ఇటీవల నోటీసులు కూడా ఇచ్చాం. అర్చకునికి ధూప దీప నైవేద్యం స్కీం ద్వారా లబ్ధి చేకూర్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

ఆలయ భూములు కాపాడుకోవాలి

పల్లా మురళి వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్

పెరికి గిద్ద అంజనేయ స్వామి ఆలయానికి పది ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. కానీ ప్రస్తుతం అవి ఇతరుల పాలయ్యాయి. ఆలయం, ఆవరణ మాత్రమే గుడి పరిధిలో ఉన్నాయి. మిగతా ఎకరాల కొద్దీ భూములు స్మశాన వాటికకని, చెట్ల పెంపకం కోసం అని తీసుకున్నారు. ఆలయ భూములను కాపాడుకోవాలి.

వైభవంగా భీమేశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన జాతర రథోత్సవంతో ముగిసింది. రాయికల్, కోరుట్ల, మేడిపల్లి, మల్లాపూర్, జగిత్యాల మండలాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ సమీప ప్రాంతం కిక్కిరిసింది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి క్యూలో నిల బడి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథంపైకి చేర్చారు. వేలాది మంది భక్తులు పోటీపడి దేవాలయం చుట్టూ ఐదుసార్లు రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై సుధీర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

నంబులాద్రి స్వామి రథోత్సవం

జాతరకు కిక్కిరిసిన భక్తులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామం లోని లక్ష్మీ నంబులాద్రి స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున లక్ష్మీ నంబులాద్రి స్వామి వారలను మంగళవాయిద్యాలతో, పండితుల వేద మంత్రాలతో, మహిళల మంగళహారతులతో ఆలయ ఆవరణలో సిద్ధంగా ఉన్న రథంపై ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు.

రథంపై ఉన్న స్వామి వారిని, ఆలయం లోపల ఉన్న మూల మూర్తి దర్శనం కోసం భక్తులు క్యూలో బారులు తీరారు. ఈ నెల 8న స్వామి వారి కల్యాణోత్సవంతో నంబులాద్రి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారం భమయ్యాయి. శుక్రవారం రథోత్సవం జాతరతో ముగిసాయి. పలు జిల్లాలతోపాటు వైష్ణవ ఆళ్వార్లు ఎక్కువగా ఉన్న తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామి వారిని దర్శనం చేసు కుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ ఆట్ల కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అన్నదానం, పులిహోర తాగునీటి వసతి కల్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, శ్రీగిరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బాలాజీ రావు, సాగర్‌రావు, సంతోష్‌రావు, సాయిరి మహేందర్, అబ్బయ్య గౌడ్, కుమార్ కిషోర్ తదితరులు పాల్గొని స్వామిని దర్శనం చేసుకున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బా రెడ్డి, సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ సబ్ డివిజన్ నుంచి పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.



దేవునిపల్లి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథాన్ని లాగుతున్న భక్తులు

బీఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలి



ఎస్‌యూ వీసీకి వినతి పత్రం అందజేస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, డిటెన్షన్ విధానం ఎత్తివేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో రెండు ఫార్మసీ కళాశాలు ఉన్నాయని, ఎక్కువ మంది విద్యార్థులు డిటెన్షన్ అవడం, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు లేకపోవడం వంటి వాటితో ఫార్మసీ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ నాయక్, జిల్లా కార్యదర్శి సంఘం గణేష్, జిల్లా నాయకులు అభిలాష్, ఉమేష్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో శుక్రవారం భక్తుల తాకిడి పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్న భక్తులు ముందుగా రాజన్న ఆలయ ధర్మ గుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతి పాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు అనంతరం శ్రీబద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.





భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఘనంగా వన మహోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారు ఏకాంతంగా విహార యాత్రకు వెళ్లేందుకు వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పండితులు పేర్కొన్నారు. గుట్ట కింది వనంలోకి గజవాహనంపై స్వామివారిని మేళతాలాలతో తీసుకువెళ్లి వనాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనాల వద్ద అటవీశాఖ అధికారులను, అర్చకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, మాజీ జడ్పీటీసీ ముప్పాల జలజ, మాజీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఆలయ ఈవో శ్రీనివాస్, జూనియర్ అసి స్టెంట్ రఘు, అటవీ శాఖ సెక్షన్ అధికారులు గంగారాం, ప్రకాష్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, అర్చకులు పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధు కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా వనమహోత్సవంలో పాల్గొన్న అర్చకులు, పోలీసులు

రాజన్న ఆలయంలో రెండో భారీ ఫ్యాన్



వేములవాడ కల్చరల్ ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం శుక్రవారం రాత్రి ఈవో కె.వినోద్‌రెడ్డి నాగిరెడ్డి మండపం సమీపంలో రెండో భారీ ఫ్యాన్ ఏర్పాటు చేశారు. వేసవి సమీపిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఫ్యాన్ ఏర్పాటు చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సన్నాహక సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించడంతో ఫ్యాన్ ఏర్పాటు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజేష్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈ రామ్ కిషన్‌రావు, పర్యవేక్షకులు వరి నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

రాజన్న కోడె దాడిలో భక్తురాలికి గాయాలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి కోడెమొక్కు చెల్లించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలిని శుక్రవారం కోడె గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బుచ్చి ఎల్లవ్వ అనే వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చింది. కోడె మొక్కు చెల్లించుకునే సమయంలో ఆకస్మాత్తుగా కోడె దాడి చేయడంతో ఎల్లవ్వకు తీవ్ర గాయమైంది. దీంతో 108 ద్వారా ఎల్లవ్వను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎల్లవ్వ ఎడమ కాలికి బలమైన గాయమైనట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. రాజన్న ఆలయానికి కోడెమొక్కుల కోసం తీసుకువచ్చే కోడెలను దాడి చేసేవి కాకుండా సరైన కోడెలను ఎంపిక చేసి ఆలయానికి తీసుకురావాలిని, ఇలాంటి సంఘటనలు ఆలయంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

క్యాన్సర్‌ను దూరం చేద్దాం

- చిన్నారులూ బాధితులే..
- నేడు చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

క్యాన్సర్ ఇప్పుడు మానవాళి ఆరోగ్య సమస్యల్లో ఒకటైపోయింది. ఎంతోమంది క్యాన్సర్ అనగానే జీవితమే ముగిసి పోయిందని మానసికంగా కృంగిపోతారు. శరీరంలోని ఏ అవయవానికైనా క్యాన్సర్ రావచ్చు. కొన్ని రకాల క్యాన్సర్‌లను ముందుగానే గుర్తిస్తే ప్రాణాలు నిలుపుకునే అవకాశం ఉంది. క్యాన్సర్ బారిన పడి పెద్దలే కాకుండా చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. అందుకే క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించి చిన్నారులను రక్షించుకోవడానికి ప్రచార కార్యక్రమాలు కూడా ప్రపంచ వ్యాప్తంగా మొదలయ్యాయి.

క్యాన్సర్ కొంతమంది కుటుంబాల్లో కొన్ని రకాల క్యాన్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అటువంటి వారు ముందుగా పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు పడడం అవసరమని చెబుతున్నా రు. క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా వందలో 24 సందర్భాల్లో పొట్టల్లో, అన్నవాహికలో వస్తున్నట్లుగా గుర్తించారు. 16 క్యాన్సర్లు ఊపిరితిత్తుల్లో, 15 క్యాన్సర్లు రొమ్ముకు, పేగులకు, ఊపిరితిత్తులకు దాదాపు 55సందర్భాల్లో క్యాన్సర్ వస్తున్నట్లుగా గుర్తించారు. వీటితో పాటు మూత్రకోశం, మూత్రపిండాల్లో 13, చర్మానికి 9, గర్భసంచి, అండాశయాల్లో, మిగతా అవయవాల్లో 14 శాతం క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్ వచ్చిన దాన్ని కనుక్కొని ఆపరేషన్ ద్వారా తొలగించడమనేది ఎంతో ఉపయోగపడుతుంది. ఆ తరువాత రెడియో థెరపీ, మందుల వాడకం వంటివి చేస్తే ఉపయోగం ఉంటుంది. క్యాన్సర్ నివారణ ప్రధానంగా మన చేతుల్లోనే ఉంటుంది. పొగ తాగడం మానివేయాలని, పీచు పదార్థాలు ఎక్కువగా తినాలని వైద్యులు చెబుతున్నారు.



ప్రపంచంలో ప్రతి ఏటా 2 లక్షల 50వేల మంది బాలబాలికలు క్యాన్సర్ బారినపడుతున్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశంలో 80శాతం బాలబాలికలు ఉన్నారు. వ్యాధిని గుర్తించకపోవడం వల్ల, తగిన వైద్య సదుపాయం అందకపోవడం వల్ల మృతిచెందుతున్నారు. క్యాన్సర్‌ను గుర్తించి తగిన చికిత్స చేస్తే కనీసం లక్ష మంది బాలబాలికల ప్రాణాలను కాపాడుకునే వీలు ఉంటుంది. అందుకే ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ పేరెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డేగా జరుపుతున్నారు. ఈ రోజున క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు అందుకు అవసరమయ్యే నిధులను కూడా సేకరిస్తారు.



హోరాహోరీగా ఎడ్ల బండ్ల పోటీలు



స్తంభంపల్లిలో ఎడ్లబండ్ల పోటీల్లో పాల్గొన్న గ్రామస్థులు

వెల్గటూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లిలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఎడ్లబండ్ల పోటీలు అలరించాయి. ఈ పోటీలో గొల్లపల్లి మండలం శెకల్ల గ్రామానికి చెందిన వెల్గటూర్ రమేష్‌కు చెందిన ఎడ్ల బండి ప్రథమ స్థానంలో నిలువగా అదే గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మణ్‌పావు తులం బంగారం అందజేశారు. జగదేవ్‌పేట గ్రామానికి చెందిన మెట్‌పల్లి అజయ్ ద్వితీయ స్థానంలో నిలువగా జగిత్యాలకు చెందిన జీజీఎం పవన్ ఎనిమిది తులాల వెండిని అందజేశా రు. షేక్ ఇమ్రాన్, పత్తిపాక పెంటయ్యకు సంబంధించిన ఎడ్ల బండ్లు తృతీయ స్థానంలో నిలువగా స్తంభంపల్లి గ్రామానికి చెందిన పాదం అన్విక్ పటేల్ నాలుగు తులాల వెండిని అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల రాజయ్య, కమిటీ సభ్యులు గోరు వంతుల మహేష్, అన్నవేని మల్లేష్, యాగండ్ల రాజయ్య, అన్నవేని వెంకటేష్, రాపాక వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

20న వేంకటేశ్వరాలయ హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీలను ఈ నెల 20న లెక్కించనున్నారు. ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఈవో కందుల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పని చేయాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతతోపాటు సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా డ్రైవర్లు పనిచేయాలని కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు అన్నారు. శుక్రవారం కరీంనగర్-2 డిపో పరిధిలో జేబీఎం ఎలక్ట్రికల్ బస్సుల డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. డ్రైవర్లు రోడ్డుభద్రతా నియమాలు పాటించాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్-2 డిపో మేనేజర్ మల్లయ్య, మెకానికల్ సూపర్‌వైజర్ తిరుపతి, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చేగుర్తి ఇసుక రీచ్ ప్రారంభించాలని వినతి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామంలోని ఇసుక రీచ్‌ను పునః ప్రారంభించాలని ఆ గ్రామ ట్రాక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం కొమురయ్య కోరారు. శుక్రవారం ట్రాక్టర్ యజమానులతో కలిసి కలెక్టర్ పమెలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. చేగుర్తి ఇసుక రీచ్ రద్దు చేశారని, దీంతో గ్రామంలోని ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్‌లు, కార్మికులు జీవనోపాధి కోల్పోయారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మన ఇసుక వాహనం (చేగుర్తి రీచ్) పునః ప్రారంభించి ట్రాక్టర్ యజమానుల జీవనోపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యజమానుల సంఘం వైస్ ప్రెసిడెంట్ చామనపల్లి శ్రీనివాస్, గాండ్ల లక్ష్మీనారాయణ, రాము, సంపత్, స్వామి, శ్రీను, ప్రశాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

- గుంతలమయంగా తహెర్ కొండాపూర్ రోడ్డు - రూ. 35 లక్షలు మంజూరు
- గతేడాది టెండర్ ప్రక్రియ - ప్రారంభంకాని పనులు - రాకపోకలకు ఇక్కట్లు



కంకర తేలిన రోడ్డు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం తహెర్ కొండాపూర్ రోడ్డు అధ్వానంగా మారింది. చెర్లబూత్కూర్ మీదుగా గ్రామానికి వెళ్లాల్సిన రహదారి వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పాడుతోంది. గ్రామం నుంచి ప్రతీ రోజు చెర్లబూత్కూర్ మీదుగా కరీంనగర్‌కు, ఇతర ప్రాంతాలకు వివిధ పనుల కోసం రాకపోకలు కొనసాగిస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఎనిమిదేళ్ల క్రితం చెర్లబూత్కూర్ నుంచి ఊరచెరువు కట్ట మీదుగా తహెర్ కొండాపూర్ గ్రామానికి రూ.35లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాంచారు. వాహనాల రాకపోకలతో రెండేళ్ల క్రితం చెరువు కట్టపై రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల గుంతలు పడింది. కొన్ని చోట్ల రోడ్డు కుంగి బీటలు పడ్డాయి. మూల మలుపుల వద్ద కంకర తేలి ప్రమాదకరంగా మారింది, కట్ట మీద నుంచి వెళ్లే సమయంలో గుంతల్లో పడి చెరువులో పడే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ద్విచక్ర వాహనాల పైనుంచి పడి పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. బీటీ రోడ్డు మరమ్మతు కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారు. ఏడాది క్రితం రూ.35లక్షలతో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు మరమ్మతు పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. పనులు చేస్తే బిల్లులు మంజూరవుతాయో లేదోననే కారణంతో పనులు ఇప్పటికి ప్రారంభించలేదని గ్రామ నాయకులు పేర్కొంటున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని, రహదారి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.



దెబ్బతిన్న రహదారి

గుండెపోటు, క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుండెపోటు, క్యాన్సర్, డయాబెటీస్, హైపర్‌టెన్షన్ రాకుండా ప్రజలు జాగ్రత్త పడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహారం, వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. చక్కెర, మైదా, నూనెతో చేసిన పదార్థాలు తక్కువగా తీసుకోవాలని సూచించారు. డీటీటీపీవో డాక్టర్ ఉమాశ్రీ, డీపీహెచ్‌ఎన్‌వో విమల, ఈఈవో రాజగోపాల్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెబ్ సైట్ ఆవిష్కరణ

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దివంగత కాంగ్రెస్ నేత ఎమ్మెస్సార్ మనవడు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు రూపొందించిన కెరీర్ 'కన్సల్టజ్' సంస్థకు సంబంధించిన వెబ్ సైట్‌ను మాదాపూర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం ఆవిష్కరించారు. కెరీర్ 'కన్సల్టజ్' సీఈవో మేనేని రోహిత్‌రావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయానికి విరాళం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి కరీంనగర్ పట్టణానికి చెందిన పొన్నం రాజేష్, శ్వేత, కుమారులు నరసింహా, మణికంఠ, తల్లి పొచమ్మ విరాళం అందజేశారు. ఎల్లమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా లక్ష రూపాయల నగదు, ఐదు తులాల బంగారు మంగళ సూత్రం, ఐదు తులాల వెండి, మట్టెలు పట్టు వస్త్రాలను సమర్పించారు. అయ్యప్ప సేవా సమితి సభ్యుడు పరమేశ్వర్ గురుస్వామి, రమేష్, బొమ్మకల్ గౌడ కులస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కల సంరక్షణ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ సహకారంతో మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం నగునూర్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9వ తరగతుల వరకు ఇద్దరు చొప్పున బాలబాలికలను మొక్కల పెంపకం, సంరక్షణ కోసం ఎంపిక చేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు తిరుపతి రావు, పీడీ సౌజన్య, కోఆర్డినేటర్ శంకరయ్య, మదన్ పాల్గొన్నారు.

దుర్శేడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఒక వృక్షాన్ని మదర్ ట్రీగా ఎంపిక చేసి చెట్లను సంరక్షించాలనే నినాదంతో ముందుకు వెళ్లాలని సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సీజీఆర్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ప్రతినిధులు అనుదీప్, రవి అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్‌రావు, పీడీ రమేష్, ఎకో క్లబ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, విజయలక్ష్మీ, సరిత రాణి, పద్మ, శారద, లత, ప్రమీల, శ్రీనివాస్, రాజన్న, ప్రకాష్, బాబు, రమణరెడ్డి పాల్గొన్నారు.



దుర్శేడ్ పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులు

గీతా మందిరం వార్షికోత్సవం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లోని మురళీ కృష్ణ ఆలయం గీతా మందిరంలో 31వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విష్ణు సేవానందగిరి స్వామి ప్రణవ పతాక ఆవిష్కరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోనె ఎల్లారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ మంద రాజమల్లు, వైస్ చైర్మన్ మండె శ్రీనివాస్ యాదవ్, ఆలయ ప్రధాన కార్యదర్శి సాయి నర్సయ్య, ప్రధాన అర్చకుడు మధుసూదనచారి, సింగిల్ విండో వైస్ చైర్మన్ గోనె నరసయ్య, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, వేల్పుల మల్లయ్య పాల్గొన్నారు.



ప్రణవ పతాక ఆవిష్కరణలో విష్ణు సేవానందగిరి స్వామి

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

భగత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కృషి యూత్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా రేకుర్తి వృద్ధాశ్రమంలో పండ్లు, రేకుర్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. యూత్ అసోసియేషన్ సభ్యులు బండారి చంద్రయ్య, దుర్గం లింగమూర్తి, దుర్గం శ్రీనివాస్, బోర్లకుంట రేవంత్, శేఖర్, సుబ్బులు, శ్యాంసుందర్, రమేష్, బండారి సాయికృష్ణ, సాయికుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జేఏసీ నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంస్థ జేఏసీ చైర్మన్ ఎంపిరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టీసీ సమ్మె సన్నాహక సమావేశంలో భాగంగా శుక్రవారం కరీంనగర్-1, 2 డిపోల ఎదుట భోజన విరామ సమయంలో జేఏసీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేయడానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైస్ చైర్మన్ కొమురయ్య, కన్వీనర్ పుల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా సాన్వి కళాశాల వార్షికోత్సవం



ప్రారంభిస్తున్న ఎస్‌యూ వీసీ ఓఎస్డీ డాక్టర్ హరికాంత్

భగత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాన్వి జూనియర్ కళాశాల డిఫెన్స్ అకాడమి వార్షికత్సోవాన్ని (ఆరోహణం-2025) శుక్రవారం ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ వీసీ ఓఎస్డీ డాక్టర్ హరికాంత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువులో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకటుకున్నాయి. ప్రముఖ న్యాయవాది, అరోరా విద్యాసంస్థల చైర్మన్ ఎంవీ శేఖర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ గాలిపెల్లి నాగేశ్వర్, సాన్వి కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్, శ్రీవశిష్ట జోనల్ డైరెక్టర్ వేణుమాధవ్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ శ్రీరాం భద్రయ్య, ఎస్సార్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పర్వునూరు సురేందర్, కళాశాల ప్రిన్సిపాల్‌లు నరేష్, వేముల కిరణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ ఎల్‌ఐసీ కార్యాలయంలో ఉద్యోగులను కలిశారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు దన్నాసింగ్, ఎండీ తాజొద్దీన్, శ్రావణ్‌నాయక్ పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తనను ఆశీర్వదిస్తే పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో నోట్ల కట్టలకు దీటుగా, బీసీగా తనను ఆశీర్వదించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకారి సాయన్నమాట్లాడుతూ తాను ఐదేళ్ల సర్వీస్ ఉండగానే వీఆర్‌ఎస్ తీసుకొని ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నట్లు చెప్పారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, సెంట్రల్ కోఆర్డినేటర్ నిషానిరాంచంద్రం, జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణ భయం ఉంది.. రక్షణ కల్పించండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ బండారి వేణుతో తనకు ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించాలని వావిలాలపల్లికి చెందిన ఆవుల మధుకర్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న మాజీ కార్పొరేటర్ బండారి వేణు అనుచరులతో తన ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులపై దాడికి యత్నించాడని ఆరోపించారు. బండారి వేణు ప్రధాన అనుచరుడు సంద బోయిన రాకేశ్ తన సోదరుడు ఆవుల సుధాకర్‌పై దాడి చేశారని ఆరోపించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హుజూరాబాద్ లీగల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మహిళా న్యాయమూర్తిపై ఓనేరస్తుడు బహిరంగ కోర్టులో దాడి చేయడాన్ని హుజూరాబాద్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. అందుకు నిరసనగా బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం విధులను బహిష్కరించారు. కరడుగట్టిన నేరస్తుల కేసులు నిత్యం విచారించే జ్యుడిషియల్ అధికారుల భద్రతకోసం అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, న్యాయవాదులు ముక్కెర రాజు, మంచికట్ల శ్రీనివాస్, భానుకిరణ్, గోపు సమ్మిరెడ్డి, ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షబేబరాత్ వేడుకలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జమ్మికుంటరూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామంలోని జామె మస్జీద్, హజ్రత్ సయ్యద్ ఇంకుషావలీ రహమతుల్లాహ్అలై దర్గాలో షబేబరాత్ వేడుకలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి, పవిత్ర ఖురాన్ పఠించారు. మానవజాతి శ్రేయస్సు కోసం దువా చేశారు. కార్యక్రమంలో సయ్యద్ అంకూషావలి, మొహమ్మద్ ఇక్బాల్, మొహమ్మద్ అబ్దుల్ కరీం, మొహ మ్మద్ తౌఫిక్ హుస్సేన్, జమాల్, నయిముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

చేతులు నరికిన వ్యక్తులకు ఉరిశిక్ష విధించాలి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని శివగంగ జిల్లా మేల్‌పిడవూరు గ్రామానికి చెందిన అయ్యాస్వామి అనే దళితవిద్యార్థి చేతులు నరికిన అగ్రవర్ణాలకు చెందిన ముగ్గురు యువకులకు ఉరిశిక్ష విధించాలని అంబేద్కర్ జాతీయ ఫిలాసఫి అవార్డు గ్రహీత పాత సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థిపై దాడికి పాల్పడటమే కాకుండా కులం తక్కువ వాడివంటూ దూషిస్తూ చేతులు నరకడం దారుణమన్నారు.

18న బహిరంగ వేలం

ఇల్లందకుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీసీతా రామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల18న ఉదయం11గంటలకు కొబ్బరికాయలు, పూజసామాగ్రి అమ్మకానికి, కొబ్బరిముక్కలు పోగు చేసుకొనుటకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. టెండర్‌పొందిన వారు మార్చి1, 2025 నుంచి ఫిబ్రవరి 28,2026 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు.

మోడల్ స్కూల్‌కు రూ.60లక్షలు మంజూరు

సైదాపూర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారంలోగల మోడల్‌స్కూల్‌కు కలెక్టర్ పమేలాసత్పతి రూ.60లక్షల నిధులు మంజూరు చేశారు. మోడల్‌స్కూల్ లోతట్టుప్రాంతంలో నిర్మించడంతో వర్షాలు వచ్చిన ప్రతీసారి స్కూల్‌బిల్డింగ్, బాలికల వసతిగృహం చుట్టూ నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో వరదస్కూల్లోకి వస్తున్నదని విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికనాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పరిశీలించిన కలెక్టర్ మోడల్‌స్కూల్, బాలికల వసతి గృహం, కిచన్ షెడ్డు, టాయిలెట్స్ నిర్మాణానికి రూ. 60లక్షలు నిధులు విడుదల చేశారు.

ప్రహరీ పూర్తయ్యేనా?

గతంలో ప్రహరీ నిర్మాణానికి రూ.70లక్షల నిధులు మంజూరు కాగా మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు, అప్పటి ప్రజాప్రతినిధి కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. అయితే కనీసం బేసిమెంట్ కూడా పూర్తి చేయ కుండా వదిలేశాడు. కాంట్రాక్టర్ ప్రజాప్రతినిధి, సీనియర్ నాయకుడు కావడంతో పనులు చేయకుండానే పైసలు తీసుకున్నాడనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు సైతం చేశారు. అతడిపై చర్యలు తీసుకొని ప్రహరీ నిర్మించేలా చూడాలని చాలా సార్లు అధికారులకు విన్నవించినప్ప టికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎట్టకేలకు మళ్లీ నిధులు మంజూరు కాగా ఈసారైనా వర్షాకాలంలోపు ప్రహరీపూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రహరీ లేక లోతట్టు ప్రాంతంలో ఉన్న మోడల్‌స్కూల్, బాలికల వసతిగృహం

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు ఎంపిక

హుజూరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సహకారశాఖ ములుగు జిల్లాలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హుజూరాబాద్‌వాసీ మాటూరి రాజేష్ ఈనెల15నుంచి 28వరకు కాకినాడలో జరిగే ఆలిండియా సివిల్‌సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. రాజేష్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఫిషరీస్ కార్యాలయం ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని జిల్లా మత్స్యసహకార సంఘాల వైస్‌చైర్మన్ పెసరు కుమారస్వామి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్, హుజూరాబాద్ ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అధ్యక్షుడు గొడుగు సమ్మయ్య, డైరెక్టర్లు పిట్టల రోజారాణి, గొడుడు రాజు, తిరుపతి, తదితరులు ఉన్నారు.

గాంధీభవన్‌కు తరలిన నాయకులు

జమ్మికుంటరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యువజనకాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు శుక్రవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, నాయకులు అన్నం ప్రవీణ్, రాచపల్లి సాగర్, బిజిగిరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్రపల్లికి చెందిన బల్గూరి హర్షిత్‌రావు జేఈఈ మెయిన్స్‌ఫలితాల్లో 99.05పర్సంటేజ్ మార్కులు సాధించాడు. ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులువిద్యార్థిని అభినందించారు.

గ్రామసభ

శంకరపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాలాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో శుక్రవారంసభ నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ సంధ్య ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

అమరజవానులను స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



మానకొండూర్‌లో కొవ్వొత్తులతో యూత్ క్లబ్ సభ్యులు

మానకొండూర్/గణేశ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పుల్వామా దాడిలో అమరులైన వీరజవానులను స్మరిస్తూ కరీంనగర్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ రావూస్ పాఠశాల, మానకొండూర్‌లో యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన జవానులసేవలు మరువలేనివని కొనియాడారు. పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నితిన్‌రావు ప్రిన్సిపాల్ రెహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

ఇల్లందకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీకి వచ్చే పిల్లలకు పౌష్టికాహారం తప్పక అందించాలని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు అందించే పౌష్టికాహారం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

మత్స్యగిరీంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి


శంకరపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామిని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ భక్తులకోసం మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, హుజూరాబాద్ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ నాంపల్లి తిరుపతి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి గట్టు తిరుపతి పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు అనురాధ ఆధ్వర్యంలో అవగాహనకార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ ప్రతినిధులు నగేష్, శంకర్, మెంటర్ టీచర్ చిరుత శ్రీనివాస్, ఉపాధ్యాయులున్నారు.



మానవహారంగా నిలబడిన విద్యార్థులు